## క్లుప్తంగా

### దాతల సహకారంతో కల్యాణ మండపం నిర్మాణం



రుద్రవరం-అప్పనపల్లె దారిలో నిర్మితమవుతున్న కల్యాణ మండపం

రుద్రవరం: మండల పరిధిలోని కొండమాయపల్లె పంచాయతీ వెలగలపల్లె పొ లిమేరలో వెలసిన లక్ష్మీ గోదా సమేత వాసపురం వెంకటేశ్వర స్వామి అమ్మవార్ల సన్నిధిలో కల్యాణ మండపం నిర్మాణం జోరుగా సాగుతోంది. ఈ నేపథ్యంలో ఆలయ నిర్వాహకులు మధుసూదనరెడ్డి, రంగనాయకులు మాట్లాడుతూ స్టాంపు రైటర్ కానాల నరసింహులు కల్యాణ మండపం నిర్మించేందుకు లక్షలాది రూపాయలు విలువ చేసే రెండెకరాల పొలాన్ని విరాళంగా ఇచ్చారన్నారు. ఆ పొలంలో దాతల సహకారంతో నిర్మాణ పనులు చేపట్టామన్నారు.

### టీటీడీ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

డోన్ టౌన్ : టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న తిరుపతిలోని శ్రీ పద్మావతి జూనియర్ బాలికల కళాశాలలో ఇంటర్ ఫస్టయర్, శ్రీ వెంకటేశ్వర జూనియర్ బాలుర కళాశాలలో ఫస్టియర్‌లో 2025-26 విద్యా సంవత్సరం ప్రవేశాలకు ఈ నెల 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని టీటీడీ సంస్థ బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. పదవ తరగతి మార్కుల ఆధారంగా సీట్లు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపీసీ,బైపీసీ కోర్సులకు రూ.5350, ఎంఈసీ,సీఈసీ,హెచ్ఈసీ వారు రూ.4,400 సంవత్సరానికి ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. బాలికలకు 450 మందికి, బాలురకు 400 మందికి హాస్టల్ సీట్లు వేర్వేరుగా ఉంటాయన్నారు. జూన్ 5న మెరిట్ లిస్టు ప్రకటించి జూన్ 9 నుంచి ప్రవేశాలు కల్పించనున్నట్లు వివరించారు.

### బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ




బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ చాటిన అర్చన

ప్యాపిలి: పట్టణానికి చెందిన అర్చన జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీ ల్లో ప్రతిభ చాటింది. ఆత్మకూరులోని కేవీకే సెంటర్‌లో బుధవారం జరిగిన బాక్సింగ్ పోటీల్లో అర్చన ప్రథ మ స్థానంలో నిలిచింది. ఈ మేరకు ఈ నెల 25వ తేదీన విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు అర్చన ఎంపికైంది.

### వీధి కుక్క దాడిలో 17 మందికి గాయాలు

సంజామల: మండల పరిధిలోని ముదిగేడు గ్రామంలో ఓ విధి కుక్క స్వైర విహారం చేసింది. దాదాపు పది రోజుల నుంచి గ్రామంలో వరుసగా 17 మందిని కరిచింది. ఆ కుక్క వస్తుందంటేనే ప్రజలు పరుగులు పెడుతున్నారు. ఎంతమంది కుక్కకాటుకు గురైన గ్రామ పంచాయితీ అధికారులు పంట్టించుకోవడంలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు స్పందించి కుక్క నుంచి విముక్తి కలిగించాలిన స్థానికులు కోరుతున్నారు.

### సబ్సిడీపై జీలుగ విత్తనాలు

కోవెలకుంట్ల: ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాలు సర ఫరా చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి నిరంజన్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతు రైతులకు 50 శాతం రాయితీతో రూ.61.50 చొప్పున ఎకరాకు పది కిలోల ప్రకారం అందజేస్తామన్నారు. గరిష్టంగా రైతులకు ఐదు ఎకరాలకు 50 కేజీల విత్తనాలు పంపిణీ చేస్తామని చెప్పారు. వరి సాగు చేసే రైతులు జీలుగ విత్తనాలను సద్వినియో గం చేసుకోని పచ్చిరొట్టె ఎరువుగా సాగు చేసి భూమిని సారవంతం చేసుకోవాలని సూచించారు. విత్తనాల కోసం రైతులు ఆయా రైతు సేవా కేంద్రాల్లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు.

### రూసా పనులపై నేడు విచారణ

కర్నూలు (సిటీ): క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కాలేజీల్లో రూసా 1.0 కింద రూ.55 కోట్లతో భవనాలను నిర్మించారు. వర్సిటీ పరిధిలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీ, కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీ, సిల్వర్ జూబ్లీ డిగ్రీ కాలేజీలో చేపట్టిన భవనాల పనులు దాదాపు పూర్తయ్యాయి. సిల్వర్ జూబ్లీ కాలేజీలోని ఆడిటోరియం మినహా రూసా నిధుల వినియోగం, ప్రస్తుతం ఆ నిధులతో నిర్మించిన భవనాల పురోగతిపై ఏపీ ఈడబ్ల్యూఐడీసీ ఇచ్చిన నివేదిక ఆధారంగా విచారణ చేసేందుకు రూసా రాష్ట్ర డైరెక్టర్ ప్రత్యేక కమిటీని ఇటీవల ఏర్పాటు చేశారు. ఆ కమిటీలో రాయలసీమ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ డి.విజయ్‌కుమార్ నాయుడు, ద్రావిడ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.కిరణ్‌కుమార్, డిగ్రీ కాలేజీల ఆర్‌జేడీ (కడప) నాగలింగారెడ్డి, నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ ఎం.శశికళ, ఏపీఈడబ్ల్యూఐడీసీ కడప సర్కిల్ ఎస్ఈ ఎస్.శివకుమార్, ఏపీఎంఎస్ ఐడీఎస్ ఈఈ ఎ.శ్రీనివాసరెడ్డిని నియమించారు. ఈ కమిటీ నేడు ఆయా కాలేజీల్లోని భవనాలను పరిశీలించనుంది.





శిరివెళ్ల- యాళ్లూరు రోడ్డు దుస్థితి ఇలా

# నరకానికి నకళ్లు

శిరివెళ్ల: మండలంలోని పలు గ్రామీణ రోడ్లు పూర్తిగా దెబ్బతిని నరకానికి నకళ్లుగా మారాయి. అన్ని రోడ్ల గుంతలు పూడ్చామంటూ డప్పు కొట్టిన కూటమి ప్రభుత్వానికి ఈ రహదారులు కనిపించలేదా అని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. జాతీయ రహదారి శిరివెళ్ల మెట్ట నుంచి గోస్పాడు మండలం యాళ్లూరు వరకు ఉన్న 6 కిలో మీటర్ల ఆర్అండ్‌బీ రోడ్డు, మండల కేంద్రం శిరివెళ్ల నుంచి రుద్రవరం మండలం చిన్న కంబలూరు మెట్ట వరకు ఉన్న 4 కిలో మీటర్ల ఆర్అండ్‌బీ రోడ్లు అడుగడుగున గుంతలతో దర్శనమిస్తున్నాయి. ఈ దారులపై వెళ్లాలంటే వాహనదారులకు ప్రాణ సంకటమే. వాహనం ఎక్కడ అదుపు తప్పి కిందపడుతుందో తెలియని పరిస్థితి. రోడ్ల విస్తీర్ణకై గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ. 35 కోట్ల నిధులు మంజూరు చేసింది. అయితే, కాంట్రాక్టర్ పనులు చేయడంలో జాప్యం చేశారు. ప్రభుత్వం పలు మార్లు నోటీసులిచ్చినా ఫలితం లేదు. కాంట్రాక్ట్ రద్దుకు అధికారులు ప్రయత్నం చేసేలోపే ఎన్నికలు వచ్చాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ రోడ్లను పట్టించుకోవడం మరచిపోయింది. పైగా గుంతలు పూడ్చామని గొప్పలు చెప్పి చేతులు దులుపుకుంది. ప్రస్తుత ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ వీరారెడ్డిపల్లె, కోటపాడు గ్రామాల్లో జరిగిన సాధారణ ఎన్నికల ప్రచార సభల్లో తమ పార్టీ అధికారంలోకి రాగానే రోడ్డు వేయిస్తానని హామీ ఇచ్చింది. ఏడాది కావస్తున్నా అతీగతీ లేదని మండల ప్రజలు మండిపడుతున్నారు.

## జాతరకు తరలివచ్చిన ప్రముఖులు



కొండుపల్లె తిరునాలలో పాల్గొన్న గంగుల ప్రభాకర్‌రెడ్డి, భూమా కిశోర్‌రెడ్డి

ఉయ్యాలవాడ: మండలంలోని పెద్దయమ్మనూరు, కొండుపల్లె గ్రామాల్లో బుధవారం జరిగిన గంగమ్మ, అంకాలమ్మ, చౌడేశ్వరి దేవి తిరునాలకు పలువురు రాజకీయ ప్రముఖులు, జిల్లా అధికారులు హాజరయ్యారు. జెడ్పీటీసీ కసాని పుణ్యలక్ష్మీదేవి, అంబటి తులసిరెడ్డి ఆహ్వానం మేరకు మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఆళ్లగడ్డ వైఎస్ఆర్‌సీపీ నాయకులు భూమా కిశోర్‌రెడ్డిలు జాతరకు హాజరై అమ్మవార్లను దర్శించుకున్నారు. వీరి వెంట పార్టీ మండల కన్వీనర్ బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, మాజీ గ్రామ సర్పంచ్ పల్లెగురుప్రసాద్‌రెడ్డి, కసాని రవీంద్రారెడ్డి, గజ్జెల కృష్ణారెడ్డి, ఆరికట్ల శివరామక్రిష్ణారెడ్డి, పోచా వెంకటరెడ్డిలతో పాటు వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, జనసేన ఆళ్లగడ్డ నాయకులు ఇరిగెల రాంపుల్లారెడ్డి తదితరులు అమ్మవారి జాతరలో పాల్గొన్నారు.

### రేపటి నుంచి గంగమ్మ జాతర

శిరివెళ్ల: గంగవరంలో ఈ నెల 23వ తేదీ నుంచి గంగమ్మ జాతర జరగనున్నది. ఈ మేరకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. జాతరలో భాగంగా 23న గ్రామ దేవతలకు పూజలు, అమ్మవారి అలంకరణ జరుగుతుంది. 24న పుట్ట బంగారం తెచ్చుట, పొంగు పాలు యాగం, బొల్లెవుల యుద్ధం కార్యక్రమాలు జరగనున్నాయి. 25న దేవతకు బోనాల సమర్పణ, మద్దిమాను యాగం జరుగుతుంది. జాతర సందర్భంగా పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు.

### 24న మాన్యం భూముల కౌలుకు వేలం

దొర్నిపాడు: మండలంలోని చాకరాజువేములలో 24న మాన్యం భూముల కౌలు వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఈఓ బాలచెంచన్న బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే 31న క్రిష్టిపాడు, కొండాపురం గ్రామాల్లో ఉంటుందన్నారు. దొర్నిపాడులో జూన్ 2న నిర్వహిస్తున్నట్లు ఈఓ వీరయ్య తెలిపారు. వేలం పాట పాడే రైతులు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని సూచించారు.

## అయ్యలూరు ఆలయ భూముల కౌలు వేలం



వేలం పాటలు నిర్వహిస్తున్న అధికారులు

నంద్యాల(అర్బన్): మండల పరిధిలోని అయ్యలూరు గ్రామ ఆలయ భూముల కౌలుకు బుధవారం వేలం పాట నిర్వహించారు. స్థానిక రామాలయ ఆవరణలో ఈఓ వేణునాథరెడ్డి అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 51 ఎకరాలను 10 మంది ఎక్కువ మొత్తంలో పాట పాడి దక్కించుకున్నారు. దేవాలయాల ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి మాట్లాడుతూ గతంలో 51 ఎకరాల భూములకు రూ. 9.27 లక్షలు రాగా ఈఏడాది రూ. 12.27 లక్షలు కౌలు వేలం వచ్చిందన్నారు. దీంతో రూ. 3 లక్షల ఆదాయం పెరిగిందన్నారు. కార్యక్రమంలో ఈఓలు రామాంజనేయశర్మ, బాల చెంచన్న, గ్రామ పెద్దలు త్రిలింగేశ్వరరెడ్డి, శంకరమ్మ, ఈశ్వరరెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, మహేశ్వర రెడ్డి, పరమేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడలేదు

- ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిలప్రియ

ఆళ్లగడ్డ: తాను పార్టీకి, చంద్రబాబునాయుడు, లోకేష్‌లకు వ్యతిరేకంగా మాట్లాడలేదని ఎమ్మెల్యే అఖిలప్రియ అన్నారు. బుధవారం ఆమె ఆళ్లగడ్డలో విలేకరులతో మాట్లాడారు. మినీ మహానాడు సందర్భంగా తాను దశాబ్దాల నుంచి పార్టీకోసం పనిచేసిన వారికి కాకుండా ఎన్నికల ముందు వచ్చి హడావిడి చేసిన వారికి పదవులు ఇవ్వొద్దు అని మాత్రమే అన్నా అన్నారు. వారికి పదవులు ఇస్తే అటువంటి వారిని పార్టీ క్యాడర్ ఊర్లోకి రానివ్వరని చెప్పానన్నారు.

## స్కూటర్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- ఒకరి మృతి.. మరొకరికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన సిద్ధయ్య, సయ్యద్

కర్నూలు : కర్నూలు మండలం వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయ సమీపంలో (శ్రీనివాస గార్డెన్)కు ఎదురుగా కుంభకోణం హోటల్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నందికొట్కూరు గ్రామానికి చెందిన పింజరి సిద్దయ్య(59) మృతిచెందారు. ముల్లా సయ్యద్ గాయాలకు గురై కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిద్దరూ కర్నూలు లారీ డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. బుధవారం స్కూటీపై నందికొట్కూరు నుంచి కర్నూలుకు వస్తుండగా కర్నూలు నుంచి ఆత్మకూరుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ముందు వెళ్తున్న ఆటోను ఓవర్‌టేక్ చేసే ప్రయత్నంలో స్కూటర్‌ను వేగంగా వెళ్లి ఢీకొట్టడంతో సిద్దయ్య, సయ్యద్ బైక్ పైనుంచి కింద పడ్డారు. సిద్దయ్య కాలు విరిగిపోవడమే కాక తలకు తీవ్ర గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో ఇరువురినీ కర్నూలు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించగా కొద్దిసేపటికే సిద్దయ్య మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. బైక్ నడుపుతూ గాయాలకు గురైన సయ్యద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదంలో మృతిచెందిన సిద్దయ్యకు ఇద్దరు కుమారులు సంతానం.

### రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



మృతి చెందిన బోయ మహాలక్ష్మీ

బనగానపల్లె రూరల్ : మండలంలోని ఇల్లూరు కొత్తపేట గ్రామ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బోయ మహాలక్ష్మీ (20) అనే వివాహిత మృతి చెందింది. స్థానికుల వివరాల మేరకు.. పలుకూరు గ్రామానికి చెందిన చిన్న మద్దిలేటి కుమార్తె బోయ మహాలక్ష్మీ, భర్త గోవర్ధన్ పలుకూరు నుంచి మోటార్ సైకిల్‌పై లక్ష్మపల్లెకు బయల్దేరారు. అయితే ఇల్లూరు కొత్తపేట సమీపంలోని మోటార్ సైకిల్ అదుపు తప్పడంతో మహాలక్ష్మీ బైకుపై నుంచి కిందపడటంతో తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అయితే ఆమె కోలుకోలేక మృతి చెందింది. మృతురాలికి 8 నెలల కుమార్తె ఉంది.

## నలుగురిపై కేసు నమోదు

పగిడ్యాల: నాలుగు తులాల బంగారు విషయంలో ఘర్షణపడి దాడి చేసిన ఘటనలో నలుగురు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ముచ్చుమర్రి స్టేషన్ ఇన్‌చార్జ్ ఎస్ఐ చంద్రశేఖర్ బుధవారం తెలిపారు. లక్ష్మాపురం గ్రామానికి చెందిన శరత్‌గౌడ్ డోన్ మండలం ఉంగరానిగుంట్ల గ్రామానికి చెందిన దస్తగిరి, విరూపాక్షమ్మ కూతురు ధనలక్ష్మిని నాలుగేళ్ల క్రితం పెళ్లి చేసుకున్నాడు. పెళ్లి సమయంలో భార్యకు చేయించిన నాలుగు తులాల బంగారు విషయమై తరచూ భార్యాభర్తలు గొడవ పడుతూ వస్తున్నారు. ఈనెల 19న భార్య తల్లిదండ్రులు, బామ్మర్దులు లక్ష్మాపురం వచ్చి సురేష్‌రెడ్డి ఇంటి వద్ద ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో మధుగౌడ్ కర్రతో శరత్‌గౌడ్ తలపై కొట్టడంతో రక్తగాయాలు కాగా కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొంది ఉదయం స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయడంతో నిందితులు దస్తగిరి, చిన్నమద్దిశంకర్‌గౌడ్, మధుగౌడ్‌లపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జ్ ఎస్ఐ తెలిపారు.

### న్యాయం జరిగే వరకు పోరాటం

కొలిమిగుండ్ల: కాలుష్యం వల్ల పంటలు నష్టపోయిన కల్వటాల, చుట్టు పక్కల గ్రామాల రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం సాగిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగమనాయుడు అన్నారు. బుధవారం రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న, మండల రైతు సంఘం నాయకులు పుల్లయ్యతో పాటు పలువురు రైతులతో కలిసి స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీకి రవాణ వాహనాల వల్ల దుమ్ముతో పంటల దిగుబడి తగ్గి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఈ విషయం పలు మార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని గుర్తు చేశారు. తహసీల్దార్ బాల ఈశ్వరరెడ్డి రామ్‌కో ప్రతినిధులతో చర్చలు జరుపుతామని వారం రోజుల క్రితం హామీ ఇచ్చారన్నారు. హామీని నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు పెద్దయ్య, శ్రీకాంత్‌రెడ్డి, కామిని ప్రతాప్‌రెడ్డి, వినయ్, చిన్ని, శరత్ తదితరులు పాల్గొన్నారు.

## 'చలో సిద్ధేశ్వరం' పోస్టర్ల విడుదల



చలో సిద్ధేశ్వరం వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

నందికొట్కూరు: ఈనెల 31న చలో సిద్ధేశ్వరం బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఐ (ఎంఎల్ న్యూ డెమోక్రసీ) జిల్లా కార్యదర్శి నరసింహులు కోరారు. బుధవారం పార్టీ కార్యాలయంలో రాయలసీమ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో చలో సిద్ధేశ్వరం వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ వెనుకబాటు తనానికి పాలకుల నిర్లక్ష్యమే కారణమన్నారు. రాయలసీమ ప్రాంతంలో కరువులు, వలసలు, రైతుల ఆత్మహత్యలు నిరంతరం జరుగుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.17 కోట్లతో ఆరు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే సిద్ధేశ్వరం ప్రాజెక్టు అలుగు నిర్మాణం చేపట్టే వరకు ఉద్యమం ఆగదన్నారు. సభకు విద్యావంతులు, విద్యార్థులుమ రైతులు, నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో రాయలసీమ విద్యావంతుల వేదిక కన్వీనర్ రత్నం ఏసేపు, పార్టీ నాయకులు మజీద్‌మియ్య, ఆంజనేయులు, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక నాయకులు జయరాం, కార్మిక సంఘం నాయకులు వెంకటేశ్వరగౌడ్ పాల్గొన్నారు.

# పాఠశాలకు పదోన్నతి

- జెడ్పీ ఉన్నత పాఠశాలగా క్రిష్టిపాడు ఎంపీయూపీ స్కూల్
- అప్‌గ్రేడ్ చేస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు
- పాఠశాల రూపురేకలు మార్చిన నాడు-నేడు పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



క్రిష్టిపాడులోని ఎంపీయూపీ స్కూల్ ముఖద్వారం



నాడుతరగతి గదులు

దొర్నిపాడు: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకువచ్చింది. ఏ ప్రభుత్వం చేయలేనంతంగా విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తూ నాడు-నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చింది. దీంతో ఏ బడి చూసినా కొత్తబంగారు లోకంలోకి వెళ్లినంత అనుభూతి కల్గుతుంది. మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను నాడు-నేడు ద్వారా రూ. 28 లక్షల నిధులతో ఆధునికీకరించారు. గ్రామంలోని యూపీ పాఠశాలల్లో 60 మంది విద్యార్థుల కంటే ఎక్కువ ఉండటం వల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేస్తూ విద్యాశాఖ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విద్యా సంవత్సరం నుంచే ఇది అమలు కానుంది. ఇదిలా ఉంటే ఏళ్ల నాటి కల నెరవేడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇక మాబడి 'పది'లం అంటూ సంబర పడుతున్నారు.

### తప్పిన అవస్థలు

కోవెలకుంట్ల మండలం, కంపమల్లంలోని ఎంపీయూపీ స్కూల్ విద్యార్థులు గతంలో గ్రామానికి 4.5 కిలోమీటర్ల దూరంలో ఉన్న భీమునిపాడులోని జెడ్పీ హెచ్ఎస్‌లో చేరువారు. ప్రస్తుతం క్రిష్టిపాడు యూపీ స్కూల్ అప్‌గ్రేడ్ కావడంతో కేవలం అరకిలోమీటరు దూరం మాత్రమే అవుతుంది. దీంతో ఆ గ్రామస్తుల విద్యార్థులు ఇప్పుడు ఎంతో మేలు జరగనుంది. దూర భారం తొలగడంతో పాటు బాలికల రాకపోకలకు చాలా సౌలభ్యంగా ఉంటుంది.

### అంతదూరం నడిచి వెళ్లాలంటే కష్టంగా ఉండేది



నేను ప్రస్తుతం గ్రామంలోని ఎంపీయూపీ స్కూల్లో 8వ తరగతి పూర్తి చేశాను. ఈ విద్యాసంవత్సరం 9వ తరగతికి హరివరం స్కూల్లో చేరాల్సి ఉంది. కానీ ప్రస్తుతం మా స్కూల్‌ను 10వ తరగతికి అప్‌గ్రేడ్ చేయడంతో సంతోషంగా ఉంది. నేను ఇక్కడే పదవ తరగతి వరకు చదువుకుంటాను.

-సమీర, విద్యార్థిని

### విద్యార్థులకు ఎంతో మేలు



ఉన్నత చదువులకు పదవ తరగతి ఎంతో కీలకం. ఎంపీయూపీ స్కూల్‌ను అప్‌గ్రేడ్ చేయడంతో ఇక ఎనిమిదోతరగతి పూర్తయిన విద్యార్థులు ఇక్కడే 9, 10 వతరగతి వరకు చదువుకోవచ్చు. చుట్టుపక్కల గ్రామాల విద్యార్థులకు కూడా ఎంతో మేలు జరుగుతుంది. ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా బోధన సాగించడంతో పాటు విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం.

-వసంతలక్ష్మి, హెచ్ఎం

## జీవనోపాధుల కల్పనపై అవగాహన పెంచాలి



అవగాహన కల్పిస్తున్న పీడీ

శిరివెళ్ల: కుటుంబ జీవనోధుల కల్పన ప్రణాళికలపై మహిళలకు అవగాహన కల్పించాలని డీఆర్‌డీఓ పీడీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో వెలుగు సిబ్బందికి అవగాహన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ మహిళల అవసరాల మేరకు ఏ నెలలో ఎంత రుణం కావాలో గుర్తించి యాప్‌లో పొందు పర్చాలన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సరిపడా రుణ ప్రణాళికలను పూర్తి చేయాలన్నారు. వాటి ఆధారంగా సంఘాలకు రుణాలు మంజూరు చేయటానికి వీలుంటుందన్నారు. సమావేశంలో బ్యాంక్ లింకేజీ డీపీఎం ఎల్లయ్య, ఐబీ డీపీఎం బాబురావు, స్త్రీ నిధి ఏజీఎం నాగప్రసాదు, క్లస్టర్ ఏసీ విజయ గోపాల్, క్లసర్ ఏపీఎంలు రాజశేఖరరెడ్డి, చిన్నమ్మ, జైపాల్, సీసీలు పాల్గొన్నారు.



దొర్నిపాడు శివారు పొలాల్లో నిలిచిన వర్షపు నీరు

## ముందస్తు వర్షం



కుందూనదిలో జలకళ

దొర్నిపాడు: గత మూడు రోజులుగా ఎడ తెరిపి లేకుండ కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి. పొలాల్లో ఎక్కడ చూసినా వర్షపు నీరే కనిపిస్తుంది. క్రిష్టిపాడు వద్ద కుందూనదిలో వర్షపు నీరు చేరడంతో నీటి ఉధృతి పెరుగుతూ వస్తుంది. ఇన్నాళ్లుగా కుందూలో నీరు అడుగంటగా ప్రస్తుతం వాన నీటితో కళకళలాడుతోంది. ఈసారి వర్షాలు సాగుకు అనుకూలంగా ఉండేలా ఉన్నాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# వాహనాలు జరభద్రం !

- వేసవికాలంలో వాహనాల భద్రత అవసరం
- సుదూర ప్రయాణం శ్రేయస్కరం కాదు
- బైకుల్లో తగు మోతాదులో పెట్రోలు నింపాలి



ఎండలో పార్కింగ్ చేసిన బైక్‌లు

గోస్పాడు: ఉదయం నుంచి సాయంత్రం వరకూ భానుడు ప్రతాపం చూపుతున్నాడు. ఈ ఎండ నుంచి రక్షణకు మనం ఎలా జాగ్రత్తలు పాటిస్తామో అలాగే వాహనాల భద్రతపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వాహనాలు ఎండలో గంటల సమయం ఉండడం వల్ల వాటి రంగు వెలిసిపోవడంతో పాటు పెట్రోల్ ఆవిరయ్యే అవకాశం ఉంది. వాహనాలకు ట్యాంకు నిండా పెట్రోల్ పట్టిస్తే ఒక్కోసారి పేలే ప్రమాదం ఉందని మెకానిక్‌లు హెచ్చరిస్తున్నారు.

**రక్షణ జాగ్రత్తలు ఇలా...**

- వాహనాలను ఎక్కువ సేపు పార్కింగ్ చేయాల్సి వస్తే చెట్టు నీడన, షెడ్లలో పెట్టుకోవాలి. లేదంటే కవర్లు కప్పి ఉంచాలి.
- అధిక ఉష్ణోగ్రతల వల్ల టైర్లలో గాలి తగ్గిపోతుంది. వారానికి ఒక సారి గాలి తనిఖీ చేయించుకోవడం మంచిది.
- గాలి ఎక్కువ కొట్టించడం వల్ల వేడికి టైర్లు పేలిపోతాయి. తగిన మోతాదులో మాత్రమే గాలి నింపుకోవాలి.
- ద్విచక్ర వాహనాలు ఎక్కువ సమయం ఎండలో ఉంచితే పెట్రోల్ ఆవిరైపోయే అవకాశం ఉంది.
- వేసవిలో పగలు కన్నా సాయంత్రం వేళల్లో పెట్రోలు కొట్టించడం మంచిది.
- గాలి కొట్టించడంలో అలసత్వం ప్రదర్శిస్తే టైర్ల మన్నిక తగ్గి పెట్రోల్ ఎక్కువ ఖర్చయ్యే ప్రమాదం ఉంది.
- దూర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు వాహనాల వేగానికి ఉష్ణోగ్రతల వేడికి ఇంజిన్ రెండింతలు వేడెక్కే అవకాశం ఉంటుంది. అందుకోసం కొంత దూరం ప్రయాణం చేసిన తర్వాత ఇంజిన్ కాసేపు ఆపుకుంటే వాహనం మన్నిక కాలం పెరుగుతుంది. నిర్ణీత గడువులోపు ఇంజిన్ ఆయిల్ మార్చుకోవాలి.

**పెద్ద వాహనాలకు ఇలా..**

- కార్లు, లారీలు ఇతర భారీ వాహనాల విషయంలో రేడియేటర్లలో నీళ్లను తరచూ తనిఖీ చేసుకోవాలి.
- నీళ్ల కంటే కూలెంట్ ఆయిల్ వాడడం మంచిది.
- కార్లలో పెట్రోల్, డీజిల్‌తో పాటు ఎల్పీజీ గ్యాస్ ద్వారా వాహనాలు నడిపేవారు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. అటువంటి వాహనదారులు వేసవిలో గ్యాస్ కిట్‌ను ఉపయోగించకుండా ఉంటే ఉత్తమం.
- ఏసీ నిలబడాలంటే కారు అద్దాలకు క్లాత్ మ్యాట్స్ ఏర్పాటు చేసుకోవాలి.
- ఎండాకాలంలో భారీ వాహనాలకు కొత్త టైర్లను వాడితే మేలు. లేదంటే దూర ప్రాంతాలకు వెళ్లే సమయంలో పాత టైర్లలో గాలి తగ్గి పేలిపోయే ప్రమాదం ఉంది.

### వేసవిలో ఫుల్ ట్యాంక్ చేయరాదు



ఈ ఏడాది ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. బైక్‌లకు పెట్రోల్ పట్టించడంలో వాహనదారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఫుల్ ట్యాంక్ చేయించడం వల్ల ప్రమాదం జరిగే అవకాశం ఉంది. తగు మాత్రంగా అవసరాలకు అనుగుణంగా పెట్రోలు వేయించుకోవడం మంచిది. ఎక్కువ సమయం ఎండలో తిరగడంతో పాటు దూర ప్రయాణాల సమయంలో జాగ్రత్తలు అవసరం.

– దేవ, మెకానిక్,నంద్యాల

### నీడలో పార్కింగ్ చేయాలి



ఒక వేళ వాహనాలను ఎండలో పెట్టాల్సి వస్తే ఏదైనా చెట్టు నీడ, ఇతర నీడ ఉన్న ప్రాంతాల్లో ఉంచాలి. వీలుకాని సమయంలో పొడవాటి క్లాత్ ట్యాంక్ పైన కప్పి ఉంచితే సరిపోతుంది. లేదంటే ఎండలకు ఆయిల్ ట్యాంకర్ హీటెక్కి ప్రమాదం జరిగే అవకాశం ఉంది. టైర్లలో తగినంత గాలి పట్టించడంతో పాటు వాహనాలపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలి.

– బాలమద్దిలేటి,బైకు మెకానిక్, సాంబవరం